
కథ



# ఒక పుస్తకం

వేదాంతం శ్రీపతిశర్మ

కాలనీలోని కమ్యూనిటీ హాలు చిన్నగా ముస్తాబయింది. రెండో పెళ్లి చూడటానికి వచ్చినట్లు పదిహేను మంది ఆ కుర్చీలలో అక్కడక్కడ అలా కూర్చున్నారు.

'వ్రాయాలని వుంది' అనే పుస్తకాన్ని మరి కొద్ది సేపట్లో ఆవిష్కరించనున్నారు. రచయిత బంధువులు, మిత్రులు తప్పదన్నట్లు కునుకుపాట్లు పడుతున్నారు. చాలా కాలం తరువాత సుందర్రామ్మూర్తి గారు కనిపించారు. తలుపు దగ్గర నిలబడి చివరి వరుసలో కూర్చున్న నన్ను అదే పనిగా చూస్తున్నారు. తెల్లని కుర్తా, పంచె, చక్కని కండువా ఆయనకు నిండుగా వుంటాయి. చేతిలో ఏదో పుస్తకం లాంటిది వుంటుంది. అది పుస్తకం కాదని చాలా మందికి తెలియదు. అది కేవలం ఒక పుస్తకం మీద అట్ట. నాకు తెలిసి దానిని ఏ రోజూ వదిలి పెట్టలేదు. మా ప్రక్క ఇంటి వరండాలో ఆయనని రోజూ పడక కుర్చీలో వున్నప్పుడు చూసే వాడిని. ఫాన్ ఓ మూల వున్నప్పటికీ ఆ అట్టముక్కతోనే విసురుకునే వారు. ఎవరైనా మంచి నీళ్లు తీసుకుని వస్తే దాని మీద పెట్టమని అలా గ్లాసు అందుకునే వారు. ఆయన ఆ ఇంట్లోంచి వెళ్లిపోయి చాలాకాలం అయింది. అయినా నన్ను గుర్తుపట్టి వచ్చి నా ప్రక్కన కూర్చున్నారు.

'కులాసాగా వున్నారా?' అడిగాను.

'రాయిలా వున్నాను. అందుకే హాయిగా వున్నాను', అన్నారు.

'మిమ్మల్ని చాలా సార్లు ఈ అట్టముక్క గురించి అడిగాను. చెప్పనే లేదు'.

'మంచివారే! పుస్తకావిష్కరణ సభకు వచ్చి అట్టముక్క గురించి అడుగుతారేం?'

'అట్టముక్క కాబట్టి తొలిపలుకు లాగా చెప్పండి'

'నిజమే. ఈ కార్యక్రమంలోనైనా మీకు చెప్పాలనిపిస్తోంది...'

అంటూ గొంతు సర్దుకున్నారు. వేదిక మీద ఎవరో మైకు ముందుకు వచ్చి గొంతు సరి చేసుకున్నారు. 'మనిషి ఎందుకు వ్రాస్తాడు?...', మైకు గియ్ మని సద్దుకుంది, '...తను మాట్లాడకూడదనా లేక మరొకరు మాట్లాడాలనా? ఒక్కసారి ఆలోచించండి...'

□□□□□

ఆ కార్యక్రమానికి అంతరాయం కలుగకుండా ఆయన చెబుతూ పోతున్నారు...

'కాలేజీ నుంచి ఇవతలికి వచ్చిన తరువాత అది వరకు లేనిది ఎందుకో పుస్తకాల మీద మోజు పెరిగిపోయింది. రోజూ దగ్గరలో వున్న గ్రంథాలయంలోకి దూరి బాగా పొద్దు పోయే వరకూ చదువుతూనే ఉండే వాడిని. ఇష్టంగా అనిపించినవి జాగ్రత్తగా పొందుపరచుకుని అలా ఎక్కడో అక్కడ వ్రాసుకుంటూ ఉండే వాడిని. ఒక చక్కని సంవాదమో లేక సన్నివేశమో లేక బాగా ఆలోచింపచేసే మాటలనో కాగితం మీద పెట్టి దాని కింద నా ఆలోచనలు రాసేవాడిని. ఒక రోజు లైబ్రరీలో కూర్చొని ఏదో చదువుతూ ఒక తెల్ల కాగితం మీద మరేదో రాయబోయి ఎందుకో ఆగాను. ఇంత తెల్ల కాగితాన్ని ఎందుకు చెడగొట్టాలి? అనిపించింది....

'చెల్లని రూపాయిని చెల్లించలేను...', రాశాను, '... తెల్లని కాగితాన్ని చెల్లా చెదురు చెయ్యలేను!' ఎందుకో నాలో నేను నవ్వుకున్నాను. అంతలోనే నన్ను ఎవరో గమనిస్తున్నారనిపించింది. చుట్టూతా చూశాను. అటూ ఇటూ ఎవరూ లేరు. పైన ఫ్యాన్ తిరుగుతోంది. ఎదురుకుండా వరుసగా పుస్తకాలున్నాయి. హాల్లోని అవతల పక్క ఎవరో ఇద్దరు ముగ్గురు పత్రికలు చదువుకుంటున్నారు. ఏదోలే అనుకుని మరల కాగితం దగ్గరికి వచ్చి ఎందుకో ఆగాను. నా ఎదురుకుండా ఉన్న వరుసలోని పుస్తకాలలో ఒకటి కొద్దిగా వంకరగా వుంది. అది చాలా లావుగా ఉన్న పుస్తకం. సామాన్యంగా తీసిన పుస్తకాన్ని ఎవరూ అంత శ్రద్ధగా తిరిగి అలానే పెట్టాలని చూడరు. దానిని సర్దాలని ఇటు తీసి ఆ సందులోకి చూశాను. ఒక అమ్మాయి ఎవరో పెద్ద కళ్లతో అటువైపు నుండి నన్ను భయంగా చూస్తూ కనిపించింది. పుస్తకాన్ని జాగ్రత్తగా ఆ కదిలించిన చోట్లోనే పెట్టేశాను. ఈ సందులోంచేనా ఈమె నన్ను గమనిస్తోంది? ఏమో! కాగితం దగ్గరికి వచ్చాను. మరల పుస్తకం కదులుతోంది....'

మైకు ముందు నిలబడ్డ వక్త చెబుతున్నాడు, '...అసలు రచయిత ఎవరు? ఏదో చూసి ఎందుకో కదలిపోయిన వాడు రచయిత. తనలో తాను ఎక్కడో రగిలిన ఆలోచనలతో నిరంతరం ఒక ద్వంద్వ యుద్ధం జరుపుకుని చివరకు కాగితం మీద నిర్ద్వంద్వంగా ఒక విషయాన్ని ప్రస్తావించే వాడు రచయిత. అందుచేత ఇతను తనలో తాను మాట్లాడుకుంటాడు. తనతోనే మాట్లాడుకుంటాడు. తన వలన పది మంది ఇలా మనలాగా మాట్లాడుకోవాలి కానీ తానెన్నడూ మాట్లాడడు...'

సుందర్రామ్మూర్తి గారు కొద్దిగా దగ్గారు. చిరిగిపోయిన కాలాన్ని విచిత్రమైన ధోరణిలో గుర్తు చేసుకుంటున్నారు.

'మా తొలి పరిచయం అలాగే జరిగింది. ఆ పుస్తకం ఏమిటో నాకు తెలియదు కానీ మా ఇరువురి మధ్య ఒక తెరని తొలగించి మమ్మల్ని కలిపింది. మా ఇంట్లోకి అడుగు పెట్టి నా గదిని వింతగా పరిశీలించింది.

'జీవితం అందంగా అమర్చిన గ్రంథాలయం కాదు....', చెప్పాను, '... ఒక రచయిత ప్రపంచం అడవి లాంటిది. వింత ఆలోచనలే వృక్షాలలా పెరిగి పోతాయి'.

ఆమె చిరునవ్వు నవ్వింది.

'ఈ అడవిలోంచి ఒక దారి తీస్తాను. వీటిని నేను సర్దుతాను'

'నీ వల్ల కాదు'

'జాగ్రత్తగా చూడండి. ఏదీ పద్ధతిగా కనిపించకపోయినా ఆ ప్రక్రియలో కూడా ఒక దారి కనిపిస్తుంది'.

'నీ ఇష్టం. నా కాగితాలేవీ తప్పి పోవటానికి వీల్లేదు. ఏ మనిషికీ హృదయం ఎక్కడుంటుందో తెలియదు. నాకు మటుకు నా కాగితం ఏదైనా నలిగినా, కనిపించకపోయినా ఎక్కడో నెప్పి పుట్టుకొస్తుంది. అదే నా హృదయం అనుకుంటూ వుంటాను!'

□□□□□

'రచయితలు సంఘ జీవులు కారు....', ఆ వక్త అంటున్నాడు, '...నిజమైన ప్రతి రచయితా ఒంటరివాడే! పది మందిలోకి రావాలంటే కొద్దిగా ఇబ్బంది పడతాడు. తన ఆలోచనలతో రెక్కలు కొట్టుకుంటున్న పక్షిలాగా పంజరంలో గిలగిలా కొట్టుకుంటూ వుంటాడు. హఠాత్తుగా మాట్లాడాలి అనేసరికి అందులోంచి ఇవతలకి ఎగురుకుంటూ వచ్చిన పక్షిలాగా, రాయటమే కాదు, మాట్లాడటం కూడా మా హక్కు అనే హక్కు పక్షిలాగా ఈ మైకు ముందుకు వస్తాడు. మీరు గమనించాలి, నేను 'హ' చాలా గట్టిగా పలుకుతున్నాను...'

అందరూ నవ్వారు. కమ్యూనిటీ హాలు మెల్లగా నిండుతోంది. సుందర్రామ్మూర్తి గారు అట్టముక్కని తడుముకున్నారు.

'నా కథలు, నవలలు, ఏవో వ్యాసాలు వగైరాలు చక్కగా సర్ది, ఏవో పాటలు పాడుకుంటూ వుండేది. అదేం చిత్రమో ఏ రోజూ వాటిని చదివేది కాదు. ఒక సంస్థకి రాసి ఇయ్యవలసిన పుస్తకం రాసేసి ఆ కాగితాలన్నీ ఆమెకిచ్చి చక్కని దస్తూరిలో రాసి ఇమ్మన్నాను. ఎందుకో ఎన్ని రోజులైనా అక్షరం ముక్క రాయలేదు. అంతే కాదు. ఏ కారణం చేతనో నాతో మాట్లాడటం కూడా మానేసింది.

ఏది అడిగినా భయంగా దూరంగా వెళ్లిపోయేది. నేను రాసింది బాలేదా? ఆమెను కించపరచేది ఏదైనా అందులో కనపడిందా? లేక ఏవో పాత సంఘటనలు గుర్తుకొచ్చాయా? అర్థం కాలేదు. అవతల వాళ్ల దగ్గర నుండి ఒకటే ఫోన్ల పరంపర. భోజనం చేస్తూ ఈ రోజు అడిగేద్దామని తల ఎత్తాను. ఇదే అడుగుతానని తెలుసు కాబోలు... గరిట గిన్నెలోకి జార్చేసి గోడకి ఆనుకుని నిలబడింది. 'పుస్తకం ఏమైంది?', అడిగాను. తల వంచుకుంది.

'ఇష్టం లేదా?'

బెదురు చూపులు చూసింది.

'కష్టంగా వుందా?'

ఏమీ మాట్లాడలేదు.

'ఏమీ చెప్పవా? దిష్టి బొమ్మలాగా నిలబడతావా?'

అప్పుడు లేనిది ఇప్పుడు బొమ్మలాగా మారిపోయింది. కళ్లల్లోకి నీరు వచ్చినట్లయింది. ఆశ్చర్యం వేసింది.

'నువ్వు మాట్లాడక పోతే కోపం వస్తుంది. నన్ను విసిగించవద్దు.'

'ఇది వింతగా వుంది...' అన్నాను. '...మరి గ్రంథాలయాలలో నీకేంటి పని? పైగా రచయితల గురించి ఆ అభిమానం ఎందుకు?'

'నన్ను నమ్మండి. నాకు పుస్తకాలు చదివేవారంటే, రాసే వారంటే ఎందుకో ఇష్టం. మీ వెంట రోజూ గ్రంథాలయం వచ్చి ఏదో చదువుతున్నట్లు నటిస్తూ మిమ్మల్నే గమనిస్తూ కూర్చున్నాను,. నా గురించి నిజం చెబితే నన్ను ఇష్టపడరని చెప్పలేదు...'

ఆ నాలుగు ముక్కలూ గబగబా చెప్పేసి లోపలకి వెళ్లిపోయింది. నా నోట్లోంచి మాట రాలేదు. ఆలోచిస్తుండగానే లోపల నుంచి ఒక సూట్‌కేస్ తీసుకొని వచ్చి నిలబడింది. బేలగా చూసింది. నవ్వొచ్చింది.

'మంచి నీళ్లు తీసుకొని రా...' అన్నాను. గబగబా వెళ్లి గ్లాసులో మంచి నీళ్లు తెచ్చింది.

'నాకోసం కాదు..' అన్నాను. '...నువ్వు గొంతు తడుపుకో!'

నన్ను చూస్తూనే గ్లాసు ఖాళీ చేసింది.

'ఇంటికి వచ్చేవరకూ ప్రతీ వస్తువూ ఒక షోకేస్‌లోని బొమ్మలాంటిదే...' చెప్పాను. '...పుస్తకం కూడా అంతే. ఇంటికి వచ్చి మనతో అనుబంధం పెట్టుకున్నాక దాని విలువ మనకి తెలుస్తుంది. నువ్వైనా అంతే. నేనైనా అంతే! అది వరకు నువ్వెవరో, నేనెవర్తో! పుస్తకాన్ని చదివిన తరువాత అర్థమైనందుకు అనుబంధం ఏర్పడుతుంది. అనుబంధాన్ని చదివే పొరపాటు ఏరోజూ చేయను!'

'మీకు మంచి నీళ్లు వద్దా?'

మరల నవ్వొచ్చింది. తనూ నవ్వింది. దగ్గరకి తీసుకొన్నాను. నా గొంతులో ఎందుకో మార్పు వచ్చింది.

'నువ్వు తెల్ల కాగితానివి' అన్నాను.

'నేను మీకు తగను'

'తెల్లని కాగితానివి.'

'నేను...లాభం లేదు'

'ఈ కాగితం మీద పిచ్చి గీతలు గీయను. అలానే వుండు!'

'ఎందుకు?'

'నేను ఏమీ రాయలేను. నీ పసితనం నాకు కావాలి!'

'నాకు అర్థం కాలేదు.'

'కానీయకు.'

'ఎందుకు?'

'నీవు తెల్ల కాగితానివి!'

తల పైకి ఎత్తింది. 'మరి మీరు?'

'నేను అక్షరాన్ని!'

□□□□□

'నిజాన్నీ, ఈ ప్రపంచాన్నీ గాఢంగా కౌగిలించుకున్నవాడు రచయిత...' మరో వ్యక్తి ఈ సారి మైకును గట్టిగా పట్టుకున్నాడు. ఎవరైనా వాక్కుంటారేమోనని భయం కూడా లేకపోలేదు. '... ఈ చేతైన ప్రతి వ్యక్తీ నీళ్లలోకి దూకేస్తాడు. ఈత చేత కాకుండానే నీళ్లలోకి దూకి, లోతు తెలుసుకుని, మరల పైకి తేలగలిగే వాడు రచయిత. ఇతను గీత కార్మికుల శ్రమలో కూడా గీతల్ని కర్మను చూపించ గలడు..' అతను తూలుతున్నాడనిపించింది.

సుందర్రామ్మూర్తిగారు ఎందుకో ఆగిపోయి ఆలోచిస్తున్నారు. 'ఇంతకీ ఈ అట్టముక్క గురించి చెప్పనేలేదు.' మరల గిల్లాను. ఆయన ఆ అట్టముక్కను ప్రేమతో నిమిరారు.

'దీని వెంట పడ్డారెందుకు? ఇందులో ఏమీ లేదు. ఊరకనే నాతో ఇలా తిరుగుతూ వుంటుంది. ఎన్నో ఒడిదుడుకులు, విసురులు దాటుకుంటూ వయసును మీద వేసుకొని కాలం గడిపేశాం. నా భాష తెలియదు, భావం అంతకంటే తెలియదు. అయినా ఎందుకో నేను ఏదైనా రాస్తుంటే నాకు ఏదీ అడ్డు తగలనీయలేదు. కనీసం బజారుకు కూడా వెళ్లనిచ్చేది కాదు. ఒకరోజు బజారుకు వెళ్లి ఎంత సేపటికీ తిరిగిరాలేదు. ఇంట్లో ట్యూషన్ చెప్పుకుంటూ కూర్చున్నాను. పిల్లలను వెళ్లిపోయారు. తలుపుమూసి బయలుదేరుదామని అనుకుంటుండగా సంచీ మోసుకుంటూ వచ్చింది. అలసిపోయి బల్లమీద కూర్చుంది.

'ఎందుకు ఈ పనులు?'

ఆయాసపడుతూనే చెప్పింది. 'అజీవిక కోసం'

'అజీవికా నా టేబిల్ మీద పూర్తవుతున్న నవల.

'బాగా జనం వున్నారా?'

'అవును'

'నిజం చెప్పు. జనం వల్లనే ఇంత లేటయిందా?' మొహం అటు తిప్పుకుంది.

'నేను ఎలాగూ ఉద్యోగం చెయ్యలేను. ఈ మాత్రం పనికి ఎందుకు బాధపడతారు?'

'ఏం చేశావు? ఇంతకీ?'

'కిరాణా షాపులో అతను నన్ను ఒక పక్క కూర్చోపెట్టాడు. నిలబెట్టలేదు లెండి.!మంచివాడు!'

'ఎందుకు?'

'అతని బాధ అతనిది. డబ్బిచ్చి కొనేవారిని ముందు పంపాలి గదా? మన లిస్టు పద్దు రాసుకోవడానికి టైం సరిపోవద్దూ?'

□□□□□

కఠినమైన నిజాలను సాహిత్యం మధురంగా చెప్పుకుంటూ వెళ్లిన రోజులున్నాయి.' మైకులో వినబడుతోంది. '...అవసరమైన చోట రచనలు నిజాన్ని నిలదీశాయి. సాహితీరంగం ఒక ప్రత్యేకతతో కూడి వుంటుంది. సమాజానికి సమాంతరంగా సాగుతూ ఒక దర్పణం పడుతుంది. ప్రతి ఉద్యమానికీ సమానంగా సాహితీ సమరాలు సాగుతాయి. జైలులోంచి కూడా మన వాళ్లు రాశారు. రాయలేని చోట వక్తృత్వంలో సాహిత్యం పెల్లుబికి దూకింది. గళం విప్పి పాడింది. నా మాట ఎవరు వింటారు? నా పాటెవరికి కావాలి అనుకుంటే ఒక 'వందేమాతరం' మనకి వుండేదా? ఒక ఎజెండా వచ్చేదా? ఒక జెండా ఎగిరేదా?'

కమ్యూనిటీ హాలులో కొంత నిశ్శబ్దం చోటు చేసుకుంది. సుందర్రామ్మూర్తిగారు ఎందుకో కొద్దిగా సిగ్గుపడుతున్నట్లు అటూ ఇటూచూశారు.

'ట్యూషన్‌కి వచ్చే పిల్లల దగ్గర తనూ కూర్చుని ఏదో రాసే ప్రయత్నించమనేది.....' చెప్పారు. '...ఏదో రోజు మీ పుస్తకాన్ని నేను చక్కని దస్తూరిలో పూర్తిగా రాసి తీరుతాను.' అంటూ ఎంతో పట్టుదలతో చెప్పేది. ఖాళీగా వున్నప్పుడు ఒక మూల కూర్చుని ముగ్గులు ప్రాక్టీసులాగా ఏవేవో ప్రాక్టీస్ చేసేది...

ఆశ్చర్యం ఏమిటంటే... నా పుస్తకాన్ని నిజంగానే తన దస్తూరితో రాయడం ప్రారంభించింది. ఎంత చెప్పినా వినలేదు. ఇంటి పనులు అలా సాగుతూనే వుండేవి. కాలం సాగుతూనే పోయింది. తనూ ఎంతో కొంత రాస్తూనే పోయింది. చాలా కాగితాలు పూర్తి చేసింది. మంచంలో వుండి కూడా గోడకు ఆనుకొని చేతిని బలవంతంగా కదిలించేది.

'ఏముంది ఈ పుస్తకంలో?' అడిగే వాడిని. '...చక్కగా రామకోటి రాసుకున్నా పుణ్యం వస్తుందేమో ఆలోచించు!' కోపంగా చూసేది. 'కోట్లాదులు రాస్తారు రామకోటి...' గట్టిగా చెప్పేది.'...కోటి కొక్కరు కూడా రాయలేరు నా పుస్తకం!'

కొన్ని కాగితాలు మిగిలిపోయిన ఆ నోట్ బుక్ పట్టుకొని ఆస్పత్రి కారిడార్‌లో చివర్న కూర్చున్నాను. గత వారం రోజులుగా లోపల ఏవేవో ప్రక్రియలు జరుగుతున్నాయి. అబ్బాయి డాక్టర్లతో మాట్లాడతాడు. డబ్బులు కడతాడు. నా పక్కన కూర్చోని ఏదో చెబుతాడు. నాకు అర్థం కాలేదు. నన్ను అక్కడే కూర్చోమన్నారు. కోడలు వస్తోంది. వెళుతోంది. చంటి పిల్లవాడిని ఎత్తుకున్నట్లు ఆ నోట్‌బుక్‌ని ఓదారుస్తూ కూర్చున్నాను. దూరంగా ఒక గదిలోంచి స్ట్రెచ్చర్ ఇవతలకి వచ్చింది. నలుగురు ఆకుపచ్చని దుస్తులలో వున్నారు. అబ్బాయి నా వైపు తిరగలేదు. అటుతిరిగి తల వంచుకొని వున్నాడు. ముఖ్య అతిథి కోసం నిలబడ్డట్లు లేచి నిలబడ్డాను.

ఎప్పుడైనా ఏదైనా వింత ఆలోచనకి స్పందించి ఏదైనా రాసుకుంటున్నప్పుడు గదిలోకి వచ్చి ఏదో కొంటెగా కవ్వించేది. కోపంలో 'చంపుతా పట్టుకొని' అనేవాడిని. నా కాగితాలలోకి తొంగి చూసి పారిపోయి తలుపుచాటున దాక్కునేది. మరల చాటుగా చూసేది. తలుపు చాటున ఆ కళ్లు మటుకు కనిపించేవి. 'నేను చావకపోతే?' కొంటెగా అడిగేది.

□□□□□

'రచనలు గాలికి చెప్పే ప్రవచనాలు కావు...', సభలో మరో పెద్దమనిషి చెబుతున్నాడు. '...పుట్టుకతో తగులుకున్న కవచ కుండలాలూ కావు రచనలు. మండుటెండకు మొండిగా నిలిచిన మహావృక్షాలు. తరాల మాటున అంతరాల చాటున ఆంతర్యాన్ని చెప్పి దారి తెలియని వారు భూమిలో కూడా, మర మనుషులకు మరో మలుపు చూపించే లోక నాయకులు. రచన ఆలోచించే వారికి ఆరోప్రాణం. అర్థం కాని వారికి అడ్డమొచ్చిన అడ్డాకు. ఏదో పదార్థం తిని పారేస్తారు. అనుభవించిన వారికి అదేయాదార్థం. పుస్తకాలు భావ పరంపరలు. పుస్తకాలు మనుగడలు, జీవధారలు, జీవాధారాలు.'

సుందర్రామ్మూర్తిగారు కళ్లు మూసుకున్నారు. అక్కడక్కడ చప్పట్లు వినిపిస్తున్నాయి. ఆయన పక్కనే టై కట్టుకొని వున్న ఒక కుర్రాడువచ్చి కూర్చున్నాడు. నల్లని బ్యాగ్ ఒకటి తొడల మీద పెట్టుకొని టక్కున తెరిచాడు.

'నా పేరు శ్రీనివాస్' అన్నాడు. నాలుగైదు పుస్తకాలు వరుసగా తీసి పేక ముక్కల్లా పేర్చాడు. 'సార్, ఇన్ని పుస్తకాలు ఒక్కసారికొంటే నాలుగొందలు యాభై, యాభై డిస్కౌంట్. మొదటి ఆప్షన్. ఈ నాలుగూ కొనడం, రెండవది – కొనకపోవడం! మీ ఆప్షన్?'

'రెండవది' తడుముకోకుండా చెప్పాను. అతను గట్టిగా నవ్వాడు. 'నిజమే! ఎందుకుకొనాలి? మీరే రైట్! అయితే నా ఆప్షన్ ఇంకా పూర్తికాలేదు. ఏమీ కొనని పక్షంలో ఇదిగోండి అన్నీ ఈ సిడిలో వుంటాయి. కేవలం మూడు వందల రూపాయలే!' సిడి చేతిలో పెట్టాడు. సుందర్రామ్మూర్తిగారి చేతిలోంచి అట్టముక్క తీసుకున్నాడు.

'సార్, పాత పుస్తకాలని మన వాళ్లు అప్పడాలు అనేవారు. ఈ రోజు నిజంగానే అప్పడాల్లాంటి సిడీలు వచ్చేశాయి. ఆలోచించండి. చూశారా? పుస్తకాలైతే చిరిగిపోయి ఇలా అట్టముక్కలు మిగిలిపోతాయి. సిడీలు ఎన్నో సంవత్సరాలుంటాయి.'

సిడీ ఇచ్చేసాను. 'వద్దు!'

అతను అట్టముక్క తిరిగి ఇచ్చేసి 'థాంక్యూ' అని వెళ్లిపోయాడు.

'మన అట్టముక్క కథ పూర్తి కాలేదు' అన్నాను. ఆయన చిరునవ్వు నవ్వారు.

'మా అబ్బాయి కూడా ఇటువంటి మార్కెటింగ్ మేధావి. అయితే మా కోడలు తాజ్‌మహల్ కూడా ఇరుకని వాదించి నెగ్గలేదు. ఎల్లకాలం ఏదో అసంతృప్తి. వరండాలోని కిటికీ మూయిం చేయాలనుకున్నాను.

రాత్రిపూట ఏదో ఘర్షణ. విదేశాలకెళ్లి పోవాలి అనిగొడవ. ఒక రాత్రి బాగా పొద్దుపోయాక వరండాలో ఎవరో కూర్చున్నట్లనిపించింది. లేచి చూశాను. ఏదో చింతిస్తూ నా ఎదురుగా వున్నకుర్చీలో అబ్బాయి కనిపించాడు.

'నిద్ర రాలేదా?'అడిగాను.

'నేను మానవ మాత్రుడిని!'

'....'

'ఎటువంటి వారికైనా ఏ ప్రాడక్టయినా అమ్మి చూపించగలను. నీ ప్రాడక్ట్ అంటే నన్ను నేను మార్కెటింగ్ చెయ్యలేక పోతున్నాను.!'

'పిచ్చి మాటలు'

'కావు. అన్నీ లెక్కలే. చీటికీ మాటికీ విశ్లేషణలు. అన్నీ ఇప్పుడే అయిపోవాలి. అందరికీ అన్నీ కావాలి. ఇప్పుడే కావాలి!'

'నువ్వు ఈ కాలానికి చేసిన జబ్బు గురించి చెబుతున్నావు.'

నా వెనక కిటికీ తెరుచుకుందని నాకు తెలుసు. కిటికీ రెక్క చాటున ఆమె వున్నదని కూడా తెలుసు. ఈమె కళ్లు కూడా పెద్దవే...

'నిద్ర ఎలా పడుతుంది?'

దుప్పటి దులిపాను. 'మీ అమ్మ నాకు మిగిల్చిన పుస్తకం...', చేతిలోకి తీసుకున్నాను. '... ఏ ప్రశ్నలూ లేకుండా దీనినీ చదవకుండా ఒక అనుబంధాన్ని ఆరాధించే కాలం ఇది కాదు. ఎక్కడో కనిపించిన దానిని ఇంట్లో పెట్టుకొని పూజలు చెయ్యడానికే, ఇంట్లో ఉన్నదానికి వాకిట్లో పారేసే దేవుడి కోసం, స్వామీజీల కోసం దేశమంతా పరుగులు తీయడానికీ చాలా తేడా వుంది. పోయి పడుకో. ఆలోచించేందుకు ఏమీ లేదు.'

'నా వల్ల కాదు'

'న్యాయం కావాలా? అన్యాయమైపోతావు. నిజాన్ని అమ్మే ప్రయత్నం చెయ్యకు. ఒకరికి తెలియని నిజాన్ని చెప్పవచ్చు.'

'నేనిలా చావవలసిందేనా?'

'ఆవేశాలు వద్దు. ఏ వేషమూ, ఆవేశమూ లేకుండా జీవితం అనే సన్నివేశాన్ని రక్తి కట్టించగల్గిన వాడు ధన్యుడు! పోయి పడుకో!'

ఏమనుకున్నాడో ఏమో లేచి లోపలకి వెళ్లిపోయాడు. వెళ్లబోయే ముందు పుస్తకాన్ని తీసి కాగితాలు తిప్పాడు.

'ఆ పుస్తకం నాకు ప్రీతి...' చెప్పాను. '...అందరికీ నచ్చాలని ఎందుకనుకుంటావు?'

తిరిగి ఇచ్చేసి వెళ్లిపోయాడు. కిటికీ తలుపు మూసుకుంది.

దాదాపు నెలరోజుల తరువాత ఒక మధ్యాహ్నం పూట పడక కుర్చీలో కునుకుపాట్లు పడుతున్నాను. ఏదో చప్పుడైంది. మూలగా చిత్తు కాగితాల వాడు తరాజులో పుస్తకాలతో పాటు అన్నిటినీ తూస్తున్నాడు. కోడలు లోపలి నుంచి ఎన్నో కాగితాలు, నోట్ బుక్స్ తీసుకు వచ్చి అతని ముందు పడేస్తోంది. అతను అట్టముక్కలు పారేసి కాగితాలు మటుకు గోతంలో వేసుకున్నాడు. ఈ పుస్తకాన్ని కూడా నా ముందరే చింపి అట్టముక్కని మూల పారేశాడు. అన్నీ మూట కట్టుకొని డబ్బులు ఇచ్చేసి వెళ్లిపోయాడు. జాగ్రత్తగా మూల పడేసిన ముక్కలన్నీ ఏరుకున్నాను. దీనిని పదిలంగా దాచుకున్నాను. నిజమే! ఒక జీవితకాలంలో పనికి వచ్చేది కేవలం సంపాదనతో కూడిన వయసు మాత్రమే. ఆ కాగితాలని నింపేసుకొని పనికి రాని బాల్యాన్ని, వార్ధక్యాన్నీ, ఆ మూల విసిరేశాడు! పై అట్ట అందగా నైనా కనిపిస్తుంది. కిందది మరీ మాసిపోతుంది. ఎలా ఉంది నా పుస్తకం?'

అట్ట ముక్క చేతిలోకి తీసుకొన్నాను.

'మీ ముందరే చింపుతుంటే మీరు ఆపే ప్రయత్నం చేయలేదా?'

'మంచివారండీ. సందు చివార్న చికెన్ షాపు వుంది తెలుసు గదా? కోడి పిల్లల్ని అతను తల్లి ముందరే నరికేస్తాడు. ఏమని అడుగుతుంది? పసిపిల్లల్ని చెత్త కుండీలలో పారేస్తున్న కాలం. పుస్తకాల గురించి ఏమడుగుతారు? తప్పు!' ఆయన ముక్కు మీద చూపుడు వేలు పెట్టారు...

□□□□□

'నిజం చెప్పే ఏ పుస్తకమైనా చిరంజీవిగానే మిగిలిపోతుంది...' ముఖ్య అతిథి చెపుతున్నారు. '....ఒక మంచి పుస్తకం పెట్టే భిక్ష అక్షయ పాత్రగా మారుతుంది. పుస్తకం కనిపించకపోయినా ఎక్కడికీ పోదు. అందులోని ఆలోచనలు ఎందరి హృదయాలలో గంటలు కొడుతూ వుంటాయో! ఒక నక్షత్రం ఎదిగి మాయమైనా ఒక బ్లాక్ హోల్ బాగా నిరంతరం శక్తివంతంగానే వుంటుంది. ఒక పుస్తకానికి తుదిపలుకులలాగా రెండే పలుకులు పలుకుతాను. పుస్తకం ఎంత పలుకుతుంది అని దయచేసి అడగకండి. ఒక పుస్తకం ఏమీ పలుకుతోంది అని ఆలోచించవలసిందిగా అందరికీ సవినయంగా మనవి చేసుకుంటున్నాను.!'

సుందర్రామ్మూర్తి గారు లేచారు. అట్టముక్క తీసుకొని కదిలారు. నేను వెనకాల నడిచాను. హాలు బయటకు వచ్చాం.

'మా వాళ్లు విదేశాలకు వెళ్లిపోయారు. నేను ఈ అట్టముక్కతో దూరపు బంధువులతో కాలక్షేపం చేస్తూ కొద్ది రోజులు పదజాలంలోకి సరిపోని పదంలా, అడ్డంగా ఒడ్డున నిలబడ్డాను. ఇది కాదనుకుని నేను వృద్ధాశ్రమానికి వెళ్లిపోయాను. ఇంతే ఈ అట్టముక్క కథ వస్తాను. ఆశ్రమం వాళ్లు ఎక్కువ సేపు గేటు తెరిచి వుంచరు..'

ఒక చేత్తో సంచి పట్టుకొని, చంకలో అట్టముక్క పట్టుకొని ఆయన ఆ కాలనీ రోడ్డు మీదకి వెళ్లిపోయారు. అలా చూస్తూనే నిలబడ్డాను. పాలు ఇవ్వడం మానేసిన ఆవు చివరికి సంతకి చేరుకుంటూ దారిలో అక్కడక్కడ కనిపించిన గడ్డిని చూస్తున్నట్లు ఆయన కాలనీలో గుర్తు వున్న వాళ్లని జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్లిపోయారు. అట్ట ముక్క మీద ఆయన రాసుకున్న మాటలు గుర్తుకొచ్చాయి.

నేను అక్షరంగానే మిగిలిపోతాను
తెల్ల కాగితంలోనే కలిసిపోతాను
పదజాలంలోని పదంలా జాలువారిపోతాను
జరగని చోట ఒక కథలా నేను జరిగిపోతాను.

చప్పట్లు వినిపించి ఈ లోకంలోకి వచ్చాను. హాల్లోకి చూశాను. మాటలలోనే ఒకపుస్తకం ఆవిష్కరించబడింది.

★

